క్లుప్తంగా

కారు బోల్తా.. ఐదుగురికి గాయాలు

మానవపాడు: టైర్ పేలి కారు బోల్తా పడ్డ సంఘటన మండలంలోని 44–జాతీయ రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నందికోట్కూర్‌కు చెందిన సలీమా, మాలిక్‌పాషా భార్యాభర్తలు, వారి కుటుంబ సభ్యులు మహబూబ్‌బాషా, అమ్‌తులా, డ్రైవర్ షేక్ మహబూబ్‌తో కలిసి పనుల నిమిత్తం కారులో సంగారెడ్డికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో మానవపాడు సమీపంలో జాతీయ రహదారి–44పై టైర్ పేలి కారు బోల్తా పడింది. సలీమా, మాలిక్‌పాషాలకు తీవ్రగాయాలయ్యాయి. మహబూబ్‌బాషా, అమ్‌తులా, డ్రైవర్ షేక్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

విశ్వరూప మహాసభ పోస్టర్ల విడుదల

గట్టు: ఎస్సీ వర్గీకరణ బిల్లు సాధనకై హైదరాబాద్‌లో ఈ నెల 11న చేపట్టే మాదిగల విశ్వరూప మహాసభకు సంబంధించిన పోస్టర్లను ఆదివారం మండల కేంద్రంలో విడుదల చేశారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బల్గెర ఏసన్న ఆధ్వర్యంలో బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహం దగ్గర నాయకులు పోస్టర్లను విడుదల చేశారు. విశ్వరూప మహాసభకు ప్రధాని నరేంద్రమోదీ హాజరు కానున్నట్లు నాయకులు తెలిపారు. అన్ని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున హైదరాబాద్‌కు తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ బండారి డేవిడ్, జిల్లా సీనియర్ నాయకులు ముక్కెరన్న, తిమ్మప్ప, నర్సింహులు, శేఖర్, మహేష్, భీమన్న, పాగుంట, మోషన్న, ప్రవీణ్, రాజు, రాముడు, నవీన్, పేతూరు, అమరేష్, రాజు, నరేంద్ర పాల్గొన్నారు.

దేవుని చిత్తానుసారం జీవించాలి

ధరూరు: ప్రతి ఒక్కరూ తమ ఇష్టానుసారంగా కాకుండా దేవుని చిత్తానుసారంగా భయభక్తులు కలిగి జీవించాలని పాస్టర్ ప్రసాద్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎంబీ షాలేంం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా క్రైస్తవులనుద్దేశించి ఆయన బైబిల్ ప్రవచనాల ఆధారంగా బోధించారు. సర్వలోక సృష్టికర్త అయిన ఏసుక్రీస్తును పోలిన జీవితాన్ని కలిగి ఉండాలన్నారు. కల్మశం లేని జీవితాన్ని గడపాలని కోరారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు సత్యన్న, సైదన్న, సీమోను, డేవిడ్, దానియేలు, ఎజ్రా, యోబు పాల్గొన్నారు.

గల్లంతైన మహిళ మృతదేహం లభ్యం

గద్వాల క్రైం: గల్లంతైన మహిళ మృతదేహం లభ్యమైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పట్టణ రెండో ఎస్‌ఐ అబ్దుల్‌షుకూర్ తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గద్వాల పట్టణంలోని షేరిల్లీవీధికి చెందిన ఖమ్రాబేగం(33)కు అయిజకు చెందిన అబిద్ హుసెన్‌తో 10 సంవత్సరాల కిందట వివాహమైంది. నాలుగు నెలల నుంచి భార్యాభర్తలు గొడవపడ్డారు. ఈ క్రమంలో భర్త తన ఇద్దరు పిల్లలను తీసుకుని అయిజకు వెళ్లాడు. ఇంట్లో ఒంటరిగా ఉంటూ కలత చెంది శనివారం రాత్రి పీజేపీ కుడి కాల్వలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. రాత్రి గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ మహిళ ఆచూకి లభించలేదు. ఆదివారం ఉదయం జములమ్మ రిజర్వాయర్‌లో గల్లంతైన మహిళ మృతదేహం తేలడంతో జాలర్ల సాయంతో మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు. తమ్ముడు జావెద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

చికిత్స పొందుతూ డిగ్రీ విద్యార్థి మృతి

మల్దకల్: చదువుకోవాలని తండ్రి మందలించడంతో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన ఓ విద్యార్థి చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఏఎస్‌ఐ ఈశ్వరయ్య కథనం ప్రకారం.. మండలంలోని మద్దెలబండకు చెందిన తిరుమలయ్య, గోవిందమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు. వీరిలో పెద్ద కుమారుడు సురేష్(20) గద్వాలలో డిగ్రీ చదువుకుంటున్నాడు. గత నెలలో సురేష్ ఇంటికి రావడంతో తండ్రి చదువుకోవాలని మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన సురేష్ గత నెల 27న పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. వెంటనే గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడని, ఈ ఘటనపై తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి..

శాంతినగర్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలిలా.. మండలంలోని కొంకలకు చెందిన తెలిగి గుడిసె శ్రీనివాసులు, ఇట్లపురం శ్రీను, టీజీ రామకృష్ణ శనివారం శాంతినగర్ నుంచి బైక్‌పై స్వగ్రామానికి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ముగ్గురిని కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గుడిసె శ్రీనివాసులు శనివారం అర్ధరాత్రి మృతిచెందాడు. ఆదివారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించడంతో ఆదివారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. శ్రీనివాసులుకు భార్యతోపాటు ముగ్గురు కూతుళ్లు, కొడుకు ఉన్నారు.

కుదేలైన పత్తి రైతులు

- వర్షం లేక దెబ్బతిన్న పంటలు
- ఆశించిన ఎర్రతెగులు, గులాబీ రంగు పురుగు..
- అప్పుల పాలవుతున్న అన్నదాతలు



తిమ్మాపూర్ శివారులో దెబ్బతిన్న పత్తి పంట

అయిజ: వానాకాలంలో కురవాల్సిన వర్షాలు సకాలంలో కురవక పోవడం, అవసరమైనంత వర్షపాతం నమోదు కాకపోవడంతో ఈయేడాది రైతులు సాగుచేసిన పత్తి పంటలు బాగా దెబ్బతిన్నాయి. అవసరం లేని సమయంలో సాధారణంగా కురవాల్సిన దానికన్న అధికంగా కురవడం వల్ల పత్తి పంటలకు తెగుళ్లు, పురుగులు ఆశించి పంటలను దెబ్బతీశాయి. పత్తిని సాగుచేసిన కొన్ని రోజులకే ఎర్రతెగులు ఆశించి పత్తపంటలు గిడుసబారాయి. వాటిని తొలగించి రైతులు మళ్లీ పత్తి పంట సాగుచేశారు. వర్షాభావం పరిస్థితులవల్ల పంటల ఎదుగుదల లోపించింది. నెల రోజుల క్రితం గులాబీ రంగు పురుగు పత్తిపంటను ఆశించి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపించింది. ఎకరానికి సుమారు 20 క్వింటాళ్లు రావాల్సిన పత్తి 2 నుంచి 5 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. దీనివల్ల రైతులు అపారంగా నష్టపోయారు.



రైతు చేతిలో నాణ్యత లేని పత్తి

దళారులకు విక్రయిస్తున్న రైతులు..

మండలంలో సుమారు 59 వేల ఎకరాలు పంటభూములున్నాయి. ఈ యేడాది 18,000 ఎకరాల్లో పత్తి పంటను సాగుచేశారు. పత్తిని చెట్టు నుంచి తీసేందుకు కూలీల కొరత ఎక్కువగా ఉంది. ఒక్కొక్క కూలికి రూ.300 నుంచి రూ.400 చెల్లించడంతో పత్తి తీయడానికే ఖర్చు తడిసి మోపడవుతోంది. పత్తి ధరను ప్రభుత్వం రూ. 7,022గా ప్రకటించింది. దళారులు పత్తిని రూ.6,500 నుంచి రూ.7వేల వరకు కొనుగోలు చేస్తున్నారు. పత్తిని తూకం వేసే సమయంలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

పత్తి రైతులకు కష్టాలు..



ఈయేడాది పత్తిని సాగుచేసిన రైతులకు అన్ని కష్టాలే మిగిలాయి. వర్షాకాలం ప్రారంభం నుంచి చివరి వరకు వర్షాలు సరైన పాళ్లలో పడలేదు. దానివల్ల పత్తి మొక్కలు ఎదుగుదల లేదు. దానికి తోడు ఎర్రతెగులు ఆశించి పంట గిడుసబారింది. గులాబీ రంగు పురుగు వల్ల దిగుబడి ఘననీయంగా తగ్గింది. ప్రభుత్వం పత్తిరైతులను ఆదుకోవాలి

– సత్యారెడ్డి, రైతు, అయిజ

మూడేళ్ల నుంచి నష్టాలే..



పత్తి పంట సాగుచేసిన రైతులకు మూడేళ్లుగా నష్టాలే వస్తున్నాయి. అధిక ధరలకు విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేసినా, దిగుబడి పెరగడం లేదు. ఈ ఏడాది పత్తి ధర తక్కువగా పలుకుతోంది. గతే డాది రూ.8 వేల నుంచి రూ.10 వేలు ధర పలికింది. ఈ సారి రూ.6 వేల నుంచి రూ.7 వేలు మాత్ర మే ధర ఉంది. ప్రభుత్వం రూ.10 వేలకు కొను గోలు చేసి రైతులను ఆదుకోవాలి.

– దేవేంద్ర, రైతు, సింధనూరు

జాగ్రత్తలు తీసుకోవాలి



రైతులు పండించిన పత్తిలో నాణ్యతగా ఉన్నది, నాణ్యత తక్కువగా ఉన్నది వేరువేరు చేసి విక్రయించుకోవాలి. తేమశాతం ఎక్కువగా ఉన్న పత్తిని ఎండలో ఆరబెట్టాలి. ఎత్తిని వేరు వేరుగా విక్రయించాలి. పత్తిలో చెత్తా చెదారం లేకుండా చూసుకోవాలి. దళారులకు విక్రయిస్తే రైతులు మోసపోతారు. త్వరలో సీసీఐ కేంద్రం ఏర్పాటు చేసే అవకాశం ఉంది. రైతులు అక్కడ పత్తిని విక్రయించుకోవాలి.

– శంకర్‌లాల్, వ్యవసాయ అధికారి, అయిజ

వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్ కండువాలు కప్పుతున్న సంపత్ కుమార్

అయిజ: అసెంబ్లీ ఎన్నికల్లో అలంపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం తథ్యమని ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో అయిజ, వడ్డేపల్లి, మండలాల్లోని వేణిసోంపురం, కొత్తపల్లి, తూంకుంట, మేడికొండ, చిన్న తాండ్రపాడు, ననసూరు, పెద్ద ధన్వాడ గ్రామాల నుంచి చాలా మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. సంపత్‌కుమార్ వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. కుటుంబ పాలనలో, ఏకపక్ష నిర్ణయాలతో రాష్ట్రాన్ని ఆగం చేశారని ఆరోపించారు.

ఎర్రవల్లిచౌరస్తా: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే సోనియాగాంధీ ప్రకటించిన ఆరు సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేస్తామని మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ అన్నారు. ఎర్రవల్లి మండలంలోని ధర్మవరం, బీవీ పల్లి, చాగాపురం గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు.కార్యక్రమంలో జోగుల రవి, రుకుమందర్‌రెడ్డి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను ఆశీర్వదించండి

అలంపూర్: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఆశీర్వదించాలని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సంపత్‌కుమార్ సతీమణి మహాలక్ష్మి ఓటర్లను అభ్యర్థించారు. అలంపూర్ మున్సిపాలిటీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో కాంగ్రెస్ మహిళా నాయకురాలు నాగశిరోమణి, చంద్రశేఖర్‌రెడ్డి, రాము, ఆసీఫ్ ఖాన్, రాంప్రసాద్ ఉన్నారు.

ఉండవెల్లి: కాంగ్రెస్ హయాంలో మహిళలకు ప్రత్యేక స్థానం ఉండేదని కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే తనయుడు దీపక్ ప్రజ్ఞ అన్నారు. మండలంలోని బొంకూరు, మెన్నిపాడు గ్రామాల్లో నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శాంతి, గోపాల్, నాగరాజు పాల్గొన్నారు.

ప్రచారంలో సర్వమత ప్రార్థనలు

అయిజ: బీఆర్ఎస్ పార్టీ నేత, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి బలపరిచిన బీఆర్ఎస్ పార్టీ టికెట్ ఆశిస్తున్న నాయకుడు అజేయుడు ఆదివారం సర్వమత ప్రార్థలో పాల్గొన్నారు. పట్టణ సమీపంలోని కట్టకింది తిమ్మప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మసీదులో, చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వివిధ కాలనీల్లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో అలంపూర్ నియోజకవర్గంలోని వివిధ మండలాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలి

రాజోళి: మేజర్ గ్రామ పంచాయతీ అయిన మండల కేంద్రంలో ఇంటర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని కళాశాల సాధన సమితి సభ్యులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో విద్యార్థుల తల్లిదండ్రులు, సాధన సమితి సభ్యులు ఆదివారం కరపత్రాలు విడుదల చేశారు. మారుమూల గ్రామంలో ఉన్నత విద్యకు నోచుకోక విద్యార్థులు చదువుల్లో వెనుకబడిపోతున్నారని, వచ్చే విద్యాసంవత్సరంలో ఇంటర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటుచేసి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కళాశాలల సాధన సమితి కన్వీనర్ గాజుల ఈశ్వరయ్య, తుకారాం, జయరాములు గౌడ్, అడివిస్వామి పాల్గొన్నారు.

పుల్లూరులో బీఎస్పీ ప్రచారం

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు గ్రామానికి చెందిన బీఎస్పీ అలంపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి కేశవరావు గ్రామంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారం చేశారు. ఆదివారం ఆలయం, చర్చి, దర్గాల్లో ప్ర త్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఇంటింటా ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు ప్రభుదాసు, మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

అధికారం ఉన్నప్పుడు అభివృద్ధి చేయలేదు

ధరూరు: జెడ్పీచైర్ పర్సన్‌గా ఉండి కూడా చేయలేని అభివృద్ధి నేడు ఏవిధంగా చేస్తానని చెబుతున్నారని బీజేపీ గద్వాల నియోజకవర్గ అభ్యర్థి బలిగెర శివారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సొంత ఊరికి రోడ్డు వేయించుకోలేని వాళ్లు గద్వాలను ఏ విధంగా అభివృద్ధి చేస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాంచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ రామాంజనేయులు, నాయకులు రాజేష్, కిష్టన్న, వెంకటేశ్వరరెడ్డి, సంజీవ్ భరద్వాజ్, రామిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి బలిగెర శివారెడ్డి

కేటీదొడ్డి: వచ్చే అసెంబ్లీ ఎన్నికలల్లో బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వాలని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి స్నిగ్ధారెడ్డి అన్నారు. బీజేపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి శివారెడ్డితో కలిసి కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.

అఖండ సంకీర్తనల్లో తుపత్రాల భక్తులు



సంకీర్తనల్లో తుపత్రాల భజన సభ్యులు

అయిజ: తిరుమల తిరుపతి దేవస్థాన కమిటీ ఆహ్వానం మేరకు అయిజ మున్సిపాలిటీ పరిధిలోని తుపత్రాలకు చెందిన మారుతి భజన భక్త మండలి సభ్యులు ఆదివారం తిరుమలలో అఖండ హరినామ సంకీర్తనలు, వేంకటేశ్వరస్వామి కీర్తనలు ఆలపించారు. ప్రతి సంవత్సరం తిరుమలలో నిర్వహిస్తున్న అఖండ భజన సంకీర్తనల్లో పాల్గొనడం ఆనవాయితీగా వస్తుందని తుపత్రాల భజన మండల సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకట్రాములు, వెంకన్న గౌడ్, చిన్న వెంకటన్న, వెంకటేష్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గద్వాల సభను విజయవంతం చేయాలి

గట్టు: సీఎం కేసీఆర్ గద్వాల పర్యటనను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. ఆదివారం గట్టులోని బీఆర్ఎస్ నా యకులు సీఎం కేసీఆర్ గద్వాలలో నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభకు వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున బీఆర్ఎస్ శ్రేణులు తరలి రా వాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకటేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



సభకు రావాలని కోరుతున్న నాయకులు

ధరూరు: గద్వాల పట్టణంలోని సోమవారం నిర్వహిస్తున్న సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు ప్రజలు పెద్దఎత్తున తరలి రావాలని మండల వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు డీఆర్ విజయ్ కుమార్‌లు కోరారు. ఆదివారం మార్లబీడు, ఓబులోనిపల్లి, ధరూరు, ర్యాలంపాడు గ్రామాల్లో కార్యకర్తలతో సమావేశమై గద్వాల సభను విజయవంతం చేయాలని కోరారు.

బహుజనుల డిమాండ్లు నెరవేర్చాలి

గద్వాల అర్బన్: బహుజనులు, రైతుల డిమాండ్లను నెరవేర్చాలని బహుజన రాజ్య సమితి జిల్లా అధ్యక్షుడు వాల్మీకీ, తెలంగాణ రైతాంగ సమితి నాయకులు గోపాల్ యాదవ్ అన్నారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాన్య ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవడం లేదని, రాజకీయ పార్టీలు పెట్టుబడిదారులకు, అగ్రవర్ణ, అధిపత్య, బడా వ్యాపారులకు టికెట్లు కేటాయిస్తున్నాయన్నారు. చిన్న పల్లెలు, పట్టణాలు, రైతులు, కార్మికులు, బహుజనుల్లోని పేదలను పట్టించుకోక పోవడం దురదృష్టకరమన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో బహుజనులకు, రైతులకు 80శాతం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు వినోద్, సుబాన్, దామోదార్, సీసల్ వెంకట్‌రెడ్డి, ఎస్ కృష్ణయ్య ఉన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

మద్యం పట్టివేత

మానవపాడు: మండలంలోని కూల్‌డ్రింక్ షాపులో ఆదివారం ప్లెయింగ్ స్క్వాడ్ సలీం ఆధ్వర్యంలో దాడులు చేసి రూ.3,800 విలువ చేసే మద్యం పట్టుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ వెంకటయ్య తెలిపారు. దాదాపు 4లీటర్ల మద్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. కూల్‌డ్రింక్ యజమాని రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బీజేపీలో చేరికలు



పార్టీలో చేరిన వారితో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

గద్వాల రూరల్: దేశ ప్రధాని చేస్తున్న అభివృద్ధి, కరోనా సమయంలో దేశఆర్థిక పరిస్థితులను కాపాడి ప్రపంచ దేశాలతో పోటీగా గర్వంగా నిలబెట్టిన గొప్ప నాయకుడు ప్రధాని నరేంద్రమోదీ అని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అన్నారు. ప్రధాని మోదీ చేస్తున్న అన్ని వర్గాల సంక్షేమాభివృద్ధిని చూసి ధరూరు మండలం రేవులపల్లి, వామన్ పల్లి, భీంపురం చింతరేవుల గ్రామాల్లోని వివిధ పార్టీలకు చెందిన సుమారు 100 మంది వాల్మీకులు బీజేపీలో చేరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారికి బీజేపీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో గద్వాల అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థి బలిగెర శివారెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి, మిర్జాపురం రాంచంద్రారెడ్డి, రామాంజనేయులు, వెంకటేశ్వర్‌రెడ్డి, రాముడు పాల్గొన్నారు.

పాముకాటుతో మహిళ మృతి



రాధిక (ఫైల్)

ఎర్రవల్లిచౌరస్తా: పాము కాటుతో మహిళ మృతి చెందిన సంఘటన ఇటిక్యాల మండలంలోని వావిలాల గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన దాసరి రాధిక (31) ఆదివారం ఉదయాన్నే లేచి ఇంటి పరిసరాలను శుభ్రం చేస్తుంది. ఈ క్రమంలో ఒక్కసారిగా కుప్పకూలి నేలపై పడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు మహిళకు నోట్లో నురుగు రావడంతో పాము కాటుకు గురైందని గమనించి చికిత్స నిమిత్తం కర్నూల్‌కు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందింది. ఆమె భర్త దాసరి తిమ్మప్పతో పాటు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఈ సంఘటనతో ఒక్కసారిగా గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నారు. ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

కాంగ్రెస్‌తోనే అందరికీ న్యాయం

గద్వాల అర్బన్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రజలకు సరైన న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ అభ్యర్థి సరిత అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆమె క్యాంపు కార్యాలయంలో మల్దకల్ మండలంలోని శేషంపల్లి, మల్దకల్, అమరవాయి, ఎల్కూరు, ధరూరు మండలంలోని చిన్నపాడు, కేటీదొడ్డి మండలంలోని గువ్వలదిన్నె, చింతలకుంట, కొండాపురం సోంపురం, గద్వాల మండలంలోని గుంటిపల్లి, జంగంపల్లి, కాకులార, గట్టు మండలంలోని ఆరగిద్ద, లింపురం గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున్న కాంగ్రెస్‌లో చేరారు. పట్టణంలోని 18వ వార్డు మాజీ కౌన్సిలర్, సరళ జాన్ మక్బూల్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా అభ్యర్థి సరిత కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో శంకర్, మధుసూదన్ బాబు, ఇసాక్, తుమ్మల నర్సింహులు, భాస్కర్ యాదవ్, తిమ్మన్న, జహంగీర్ ఉన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన వారితో కాంగ్రెస్ అభ్యర్థి సరిత

ప్రజాస్వామ్య విప్లవం తేవాలి

గద్వాల అర్బన్: నూతన ప్రజాస్వామ్య విప్లవాన్ని తేవాలని ప్రధాన వక్తలు పాణి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో కామ్రెడ్ సుగుణ 20వ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా కామ్రెడ్ సుగుణ జీవితం ప్రజలకే అంకితం చేశారన్నారు. చరిత్రలో ప్రజాస్వామ్యం పేరుతో బూర్జువ విప్లవాలు వచ్చాయన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం ఉండడం అంటే భిన్నాభిప్రాయాలు, భిన్నపోరాటాలు గౌరవించడం, నిలబెట్టుకోవడం అని అన్నారు. నేడు అన్ని వస్తువులాగే ఓట్లను సైతం కొనుగోలు చేస్తున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. అనంతరం సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి మాట్లాడుతూ గద్వాల రెండు నదుల మధ్య ఉన్నా నీటి కటకట ఎందుకు ఉందో ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. నేడు భూమిని కాపాడాల్సిన బాధ్యత అందరిదన్నారు. సభలో సుప్రీమ్ కోర్టు సీనియర్ న్యాయవాది దిలీప్, పత్రిక ఎడిటర్ రహిమాన్, చైతన్య మహిళా సంఘం జిల్లా కన్వీనర్ జ్యోతి, సీఎల్‌సీ జిల్లా అధ్యక్షుడు సుబాన్, మధుసూదన్‌బాబు, సుగుణ తల్లి వేదమ్మ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాణి

బీఆర్ఎస్‌కే ఎంఐఎం మద్దతు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: రాబోయే శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తామని ఎంఐఎం పార్టీ జిల్లా అధ్యక్షుడు మున్నాబాషా అన్నారు. ఆదివారం ఫంక్షన్ హాల్లో ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు మున్నాబాషా మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ముస్లిం మైనార్టీలకు అండగా నిలబడ్డారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జ్ రాకేష్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: సంక్షేమ పథకాలు పేదలకు భరోసాగా నిలిచాయని మండల అధ్యక్షుడు ఉరుకుందు అన్నారు. మండల కేంద్రంలోని నందిన్నె, సోంపురం గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డికి ఓటు వేయాలని ప్రచారం చేశారు.

ధరూరు: ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాయని, బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కురువ వీధి, బోయ వీధి, మాల వీధుల్లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి చేశా



కొర్విపాడులో మాట్లాడుతున్న అబ్రహం

మానవపాడు: అలంపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని ఎమ్మెల్యే వి ఎం అబ్రహం అన్నారు. ఆదివారం మండలంలోని కొర్విపాడు, చంద్రశేఖర్‌నగర్, శ్రీనగర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొర్విపాడు సీసీ రోడ్డు, గ్రామ అభివృద్ధికి రూ.1కోటికి పైగా నిధులు ఇచ్చానని, చంద్రశేఖర్‌నగర్‌కు రూ. 3కోట్లకు పైగా నిధులు అందించానని పేర్కొన్నారు. నియోజకవర్గంలో 7 మండలాల్లో అన్ని రంగాల అభివృద్ధికి కృషి చేశానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు శ్రీనివాసులు, ఉషారాణి, ఎంపీటీసీ స్వాములు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి, శిరామ్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, గొల్ల వెంకట్రాముడు, బోరవెల్లి వెంకట్రాముడు, అనంతేశ్వర్‌రెడ్డి, శంకర్‌గౌడ్, శివకేశవ్‌రెడ్డి, చాంద్‌బాషా, రశీద్, వెంకన్న పాల్గొన్నారు.

మేనిఫెస్టోల్లో కార్మికులు, ఉద్యోగుల ప్రస్తావనేదీ?

గద్వాల అర్బన్: రాష్ట్రంలో ఎన్నికల సందడి మొదలైందని, కానీ ఏ రాజకీయ పార్టీ కూడా కార్మికుల, ఉద్యోగుల సమస్యలపైన మేనిఫెస్టోను విడుదల చేయలేదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, కార్యదర్శి నర్సింహ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వాలు అధికారంలోకి రావాలన్నా, ప్రభుత్వానికి సంపద చేకూర్చడంలో కార్మిక వర్గానిది కీలక పాత్ర అన్నారు. కానీ వారి సమస్యలను రాజకీయ పార్టీలు విస్మరించడం దుర్మార్గమన్నారు. సమావేశంలో నాయకులు రంగారావు, నర్సింహ, వెంకటేశ్వర్లు, ఉప్పేరు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి నర్సింహ